


# కరపత్రం

SINCE 2014

శనివారం జూన్ 27, 2026 సంపుటి : 2 సంచిక : 255 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



## ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి

- ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు
- డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ




**న్యూఢిల్లీ,జూన్26 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు.

మిగతాద్ది 2 లో

# డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే

- ఈ మహమ్మారిని తరిమి కొట్టడంలో కలసి రండి
- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

**హైదరాబాద్,జూన్26:** సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని



కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



## ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై కన్నేయాలి

- ఫీజు రియంబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించాల్సిందే
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి

**హైదరాబాద్,జూన్26 :** విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు వసూలు చేసే కాలేజీలు కనీస విద్యా ప్రమాణాలను , వసతులను ఖచ్చితంగా పాటించాలన్నారు.

2 లో



## ఆర్ఎస్‌పి హత్యకు కుట్ర

- భద్రత తగ్గించడంపై శ్రీనివాస్ గౌడ్ ఆందోళన

**హైదరాబాద్,జూన్26 :** బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు హత్యకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతన్నదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.



2లో..

## ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

» వాతావరణశాఖ భారీ రెయిన్ అలర్ట్ జారీ

» అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ

**హైదరాబాద్, జూన్26 :** నైరుతి రుతుపవనాలు ఏపీలో విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ వానలు పడగా.. అమరావతి వాతావరణ కేంద్రం భారీ వర్షసూచన జారీ చేసింది. జూన్ 26వ తేదీన అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పోలవరం, పశ్చిమగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక మిగతా జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశముందని, పొలాల్లో ఉండే కూలీలు,




2లో..

## డ్రగ్స్ రహిత తెలంగాణ మా లక్ష్యం

- డ్రగ్స్‌పై పోరాటంలో ఈగిల్ ఫోర్స్ కృషి అసామాన్యం
- డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి
- ఈగిల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి

**హైదరాబాద్,జూన్26 :** విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు.



2లో..

## సీఆర్ పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో ప్రజలకు చెప్పాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్, జూన్26 :** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రస్తావించిన ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



2 లో

## హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

- దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది
- 1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం
- వికారాబాద్ జిల్లా చేవెళ్ల త్వరలో ఏర్పాటు
- సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్26 :** సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా, కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

## తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు: కేటీఆర్




**పరిగి:** ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా పథకాలేవీ తేలేదన్నారు. రూ.12వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన రేవంత్.. కనీసం లక్షాధికారులను చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వదని ఎద్దేవా చేశారు.

## అయోధ్య నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

- 200కోట్ల అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పాలి
- భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్



మిగతాది 2లో

**హైదరాబాద్,జూన్26 :** అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగి ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్ధవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో ప్రధాని మోదీ, అమిత్ షా, యోగి ఆదిత్య నాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని చామల మండిపడ్డారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం జూన్ 27, 2026

# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

మొదటి పేజీ తరువాయి
డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హై-ఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు. ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీయూ-ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్‌ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చందనవెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ, ఫ్యాబ్ సిటీ ప్రాంతాలు కూడా డేటా సెంటర్ క్లస్టర్లుగా అభివృద్ధి చెందుతున్నాయి.

# ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి

మొదటి పేజీ తరువాయి
ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన్' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# డ్రగ్స్ రహిత తెలంగాణ మా లక్ష్యం

మొదటి పేజీ తరువాయి
డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళ్తుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరఫున కఠినమైన చట్టాలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలని ఆయన ఆకాంక్షించారు.

# సీఆర్ పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో ప్రజలకు చెప్పాలి

మొదటి పేజీ తరువాయి
శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, తుంగభద్ర అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని అన్నారు. తెలంగాణకు ఆ రెండు ప్రాజెక్టుల నుంచి 15.9 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా, కేవలం 5 టీఎంసీలే చూపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణకు రావాల్సిన వాటా కంటే తక్కువకు అంగీకరించారని పేర్కొన్నారు. అలాగే ఎస్ఐఆర్‌పై ఓవైసీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, భాజపా ఐడీ కార్డు మాత్రమే కాదు, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల చెల్లుబాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు.

# అయోధ్య నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

మొదటి పేజీ తరువాయి
చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. దేశంలో ప్రజలు ఏ స్థితిలో ఉన్నా అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారన్నారు. 'ప్రజలు దేవుడి కోసం డబ్బులు ఇచ్చారు. మీరు దోచుకోవడం కోసం కాదు' అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి
రైతులు, పుశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షాలు పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని పేర్కొంది. ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గడిచిన 24 గంటల్లో పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లిలో 5.2 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదవ్వగా.. కృష్ణా జిల్లా గుడివాడలో 3.5 సె.మీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురంలో 3.5 సె.మీ, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో 3.3 సె.మీ, ఏలూరు జిల్లా భీమడోలులో 3 సె.మీల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఇక ఏలూరు జిల్లా కైకలూరులో 2.9 సెంటీమీటర్లు, విజయనగరంలో 2.7 సె.మీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా అమలాపురంలో 2.6 సె.మీ, ఎన్టీఆర్ జిల్లా పాలేరు బ్రిడ్జి 2.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక రాయలసీమలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఈదురుగాలులు 40-50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని తెలిపింది. ఇక కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవనుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగనుంది. ఏపీపై కూడా ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, పంటల సాగు విషయంలో ప్రత్యామ్నాయలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అటు తెలంగాణలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. జూన్ 26,278వ తేదీల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఇక జూన్ 27,28వ తేదీల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వానలు కురుస్తాయని తటిపింది. ఇక జూన్ 28,29వ తేదీల విషయానికొస్తే.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**- 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి**
**- జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం**

తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు. సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

**- కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా,విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పెట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు. ప్రత్యేక రోడ్డు మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యునిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు స్పష్టం చేశారు. అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో ఇంఉఒఇ (ఇశ్రీతిబివ ంనిబితి- ఔజీతీఇ౯నీబితిఇ౯బ ఉతీనీబీజూ టనీతీ ఒజీలి ఇనిటనీతీఇ౯వఏవనిబి)పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్ధవంతంగా పనిచేస్తోందని చెప్పారు. ఒకప్పుడు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్,ఈగిల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్‌ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు. ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి పిసిబి అధికారి మునిప్రసాద్ ఇంట్లో ఎసిబి సోదాలు

నగరంలోని చాణక్యపురి కాలనీలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) జోనల్ అధికారి యుగంధర్ మునిప్రసాద్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. తిరుపతిలోని పీసీబీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలతో ఏసీబీ తనిఖీలు చేసింది. కర్నూలుతో పాటు తిరుపతి, హైదరాబాద్‌లో ఏకకాలంలో సోదాలు జరుగుతున్నాయి. ఈ దాడులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.5.87 లక్షల నగదు, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్‌బీఐ లాకర్, రెండు ఇళ్లు, భార్య పేరున 4 ఓపెన్ ఎ÷-లాట్లు, 17 తులాల బంగారం, 3 కిలోల వెండి ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆస్తుల విలువ రూ.4 కోట్లు ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. బహిరంగ మార్కెట్‌లో ఈ విలువ మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఆర్ఎస్‌పి హత్యకు కుట్ర

మొదటి పేజీ తరువాయి
రాష్ట్ర ప్రభుత్వం ప్రవీణ్‌కుమార్ భద్రతను కుదించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కు భద్రత తొలగించాలని ఇంటెలిజెన్స్ నివేదిక ఇచ్చిందా.. ఇస్తే ఆ నివేదికను బయట పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కాగా, ఇటీవల కాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ముందుంటున్నాడు. ముఖ్యంగా బండీ భగీరథ్ పోక్స్ కేసులో చురగ్గా పని చేశాడు. ఆయన మాజీ ఐపీఎస్ అధికారి కావడంతో చట్టం లోని లోటుపాట్లపై అవగాహన ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వ చట్ట వ్యతిరేక విధానాలపై గళం విప్పుతున్నా డు. ఈ క్రమంలో ప్రభుత్వం కావాలనే ఆయన భద్రతను కుదించింది అనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

# ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై కన్నేయాలి

మొదటి పేజీ తరువాయి
గతంలో విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ఆధారంగా, కనీస ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలను గౌరవించి, వాటిని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆమె స్పష్టం చేశారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి విద్యా సంవత్సరానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సద్వినియోగం అయ్యేలా, అర్హులైన విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజయశాంతి కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో కూడిన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ఆమె ప్రభుత్వానికి హితవు పలికారు.

## మైసిరెడ్డిపల్లి భూమి పై పునర్విచారణ చేసిన పోలీసులు

# మల్లిగారి జార్జ్, సంతోష,మధుకర్ లపై కేసు నమోదు

■ కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

**మైసిరెడ్డిపల్లి మాయగాడు మల్లిగారి జార్జ్ ఆటలకు చెక్ పెట్టిన పోలీసులు**

అమ్మిన భూమిపై మళ్లీ కబ్జా కొరకు దౌర్జన్యానికి పాల్పడ్డ జార్జ్ తన కుటుంబం పై అసహ్యం వ్యక్తం చేస్తున్న మైసిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు
ఆలస్యంగా అయినా న్యాయం పక్షాన నిలిచిన మేడ్చల్ పోలీసులకు అభినందనలు తెలుపుతున్న ప్రజలు

■ **మేడ్చల్ మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 114 లోని ఒక ఎకరం మూడు గుంటల భూమిని మల్లిగారి లక్ష్మి, దివంగత మల్లిగారి మైసయ్య నుండి 1998 సంవత్సరంలో రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నం. 5708/1998**

**ద్వారా తేదీ: 15 అక్టోబర్ 1998 రోజున కొనుగోలు చేసింది.అప్పటినుండి ఇట్టి భూమిని వారే అనుభవిస్తున్నారు. ఇట్టి భూమిలో మల్లిగారి లక్ష్మి ఆమె కుటుంబం నిరంతరం వ్యవసాయము చేస్తున్నారు.**

కానీ ఇట్టి భూమి ప్రభుత్వం ద్వారా అసైన్ చేయబడ్డ లావుణి పట్టా..

ఇట్టి భూమి కొన్నాను కాబట్టి మాదే అనే నమ్మకంతో హక్కుతో ఆమె కుటుంబం అట్టి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ ఉన్నది.

తదనంతర కాలంలో భూమి యజమానురాలు లక్ష్మి, ఇట్టి భూమిని అమ్మిన మల్లిగారి మైసయ్య ఇద్దరూ చనిపోయారు.

**భూమి అమ్మినప్పటికీ మల్లిగారి మైసయ్య పేరు ఇంకా రికార్డులో కనిపిస్తున్నదని అతని కొడుకు మల్లి గారి జార్జ్ కుట్రకు తెరలేపి కబ్జాదారుని అవతారం ఎత్తాడు.**

మైసిరెడ్డిపల్లి గ్రామంలో మల్లి గారి జార్జ్ కు ఘనమైన చరిత్ర ఉన్నది. భూ కబ్జాలలో భూమి కిరికిరి లలో తలదూర్చి అమాయకుల జీవితాలతో ఆడుకోవడం అతని నైజం.

ఈ భూమి యజమానురాలు లక్ష్మి ఏకైక వారసుడైన కరుణాకర్ భూమి కొన్న సమయంలో 8 సంవత్సరముల బాలుడు.

మైసయ్య పేరు మీద ఉన్న ఇట్టి అసైన్ భూమిని మల్లిగారి జార్జ్ 2006 సంవత్సరములో శిరీష్ అనే వ్యక్తికి డాక్యుమెంట్ నం.24145/2006 ద్వారా మళ్లీ అమ్మేశాడు.విషయం తెలియక సబ్ రిజిస్టార్ ఆఫీసులో భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న శిరీష్ ను కూడా జార్జ్ మోసం చేశాడు.ఇలా ఒకే భూమిని ఇద్దరికీ అమ్మిన మోసగాడు జార్జ్ తిరిగి అట్టి భూమిని తన స్వాధీనం చేసుకోవాలని మే నెల 29వ తేదీన అతడు అతని భార్య సంతోష అతని కొడుకు మధుకర్ తో కలిసి సర్వేనెంబర్ 114 భూమిలోకి అక్రమంగా ప్రవేశించారు.జెసిబి తో పాటు అట్టి భూమిలోనికి ప్రవేశించిన జార్జ్ అతని కుటుంబము నేల గట్టు లను చదును చేయడం ప్రారంభించారు.


31 May 2026 - Page 3

సివిల్ కేసులో మేడ్చల్ ఎస్ఐ,సిఐ దౌర్జన్యం

దరఖాస్తు ఇవ్వడానికి వెళితే బాధితుని కాలు విరగొట్టిన పోలీసులు

విస్తు పోయిన దేవదానం వారిని అడ్డుకోబోయే ప్రయత్నం చేసినప్పుడు జార్జ్ అతని కొడుకు మధుకర్ భార్య సంతోష లు కలిసి దేవదానం పై దౌర్జన్యం చేశారు.

అడ్డుకోబోయిన దేవదానం రెండవ భార్య మంజుల లను కొట్టడం జరిగింది.

వార్త తెలుసుకున్న దేవదానం కొడుకు ప్రదీప్ అక్కడికి చేరుకున్నాడు. అతన పైన కూడా జార్జ్ చేయి చేసుకున్నాడు.

గొడవ జరుగుతుందన్న విషయము ఫోన్ ద్వారా తెలుసుకున్న దేవదానం కొడుకు కరుణాకర్ హుటాహుటిన ఆ స్థలానికి చేరుకున్నాడు.ఆ సమయానికి ప్రదీప్ మరియు జార్జ్ కలబడుతూ కనిపించారు. గొడవను ఆపి ఇట్టి సంఘటనను పోలీసుల దృష్టికి తీసుకురావడానికి మాజీ సర్పంచ్ అయిన కరుణాకర్ మేడ్చల్ పోలీస్ స్టేషన్ కి వెళ్ళాడు.

జార్జ్ ఈ మొత్తము సంఘటనను ముందే రూపకల్పన చేసుకుని, గొడవ పెట్టుకుని దేవదానము అతని కుటుంబం పై క్రిమినల్ కేసు నమోదు చేయించి భూమిపైకి రాకుండా పోలీసుల సహాయంతో భూమి కబ్జా చేసుకోవాలని కుట్రపన్నాడు.

మల్లిగారి జార్జ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులతో మేడ్చల్ పోలీసులను ముందుగానే ప్రభావితం చేసుకోగలిగాడు.

పాస్ బుక్ లో మల్లిగారి జార్జ్ పేరు ఉన్నదని, అతడే భూమి యజమాని అని పోలీసులను నమ్మించాడు.

మొక్కబోయిన చేతులను నరికేసినట్టు ప్రవర్తించిన పోలీసుల వైఖరిపై ఆశ్చర్యపోయిన కరుణాకర్ ఈ మొత్తం విషయాన్ని పోలీసు అధికారుల దృష్టికి తీసుకొని వచ్చాడు.

మల్లిగారి జార్జ్ భార్య సంతోష ఇచ్చిన అక్రమ ఫిర్యాదు తో కరుణాకర్ పైన అతని కుటుంబ సభ్యుల పైన అక్రమ కేసు నమోదు చేసిన పోలీసుల వైఖరిని కరుణాకర్ తెలంగాణ హైకోర్టు దృష్టికి తీసుకొని వచ్చాడు.

మల్లిగారి కరుణాకర్ అతని కుటుంబ సభ్యుల పైన తప్పుడు కేసులు పెట్టి మేడ్చల్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ ఐ ఆర్ ను కొట్టివేయాలని కరుణాకర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు.

అంతేకాక, కరుణాకర్ మేడ్చల్ పోలీసుల పైన నేషనల్ ఎస్సీ ఎస్టీ కమిషన్ లో కూడా ఫిర్యాదు చేశాడు.

**ఈ మొత్తం వ్యవహారంలో అధికార పార్టీ నాయకుల మాటలు విని మొత్తం విషయంలో కరుణాకర్ కు అతని కుటుంబ సభ్యులకు మేడ్చల్ పోలీసులు చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ కరుణాకర్ మూడు కేసులు నమోదు చేశాడు.**

■ **ఆ మొత్తం కేసుల విచారణ ఇప్పుడు నడుస్తున్నది. ఈ సంఘటన జరిగిన తర్వాత మేడ్చల్ సిఐ సత్యనారాయణ గారు మళ్ళీ స్వయంగా జోక్యం చేసుకొని పెద్దమనుషుల సమక్షంలో విచారణ చేశాడు.**

విచారణలో సర్వే నెంబర్ 114 లోని ఒక ఎకరం మూడు గుంటల భూమి మల్లిగారి లక్ష్మి డబ్బు చెల్లించి న్యాయంగా కొని చట్ట ప్రకారము రిజిస్ట్రేషన్ చేసుకున్నదని సిఐ గారు నిర్ధారణ చేసుకున్నారు.

అంతేకాకుండా ఇదే భూమిని జార్జ్ ఇంకొకరికి కూడా అమ్మి రిజిస్ట్రేషన్ చేశాడని కరుణాకర్ మేడ్చల్ పోలీసులకు సాక్ష్యాధారాలు సమర్పించాడు.

మల్లిగారి జార్జ్ ఒకే భూమిని రెండు సార్లు అమ్మి,ఇద్దరినీ మోసం చేసి తిరిగి అట్టి భూమిని తానే స్వాధీనం చేసుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల అండతో దౌర్జన్యానికి పూనుకున్నాడు.

■ **మా ప్రభుత్వం ఉంది,కాంగ్రెస్ నాయకులు నా వెంట ఉన్నారు,నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరు అని జార్జ్ విర్రవీగి ప్రవర్తిస్తున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చింది. కాంగ్రెస్ నాయకులకు కూడా జార్జ్ అసలు స్వరూపం తరువాత తెలిసింది.**

కేసు విచారణలో నిజానిజాల నిర్ధారణ చేసుకున్న మేడ్చల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ సత్యనారాయణ గారు మల్లిగారి జార్జ్ ను అట్టి భూమిలోనికి ప్రవేశించకూడదని, ఎలాంటి శాంతి భద్రతల సమస్య సృష్టించకూడదని హెచ్చరించారు.

పెద్దల సమక్షంలో విచారణ జరిగిన తర్వాత, మేడ్చల్ సిఐ హెచ్చరికను కూడా లెక్కచేయకుండా తేదీ 22 జూన్ 2026 రోజున మల్లి గారి జార్జ్ అతని భార్య సంతోష కొడుకు మధుకర్ లతో కలిసి కరుణాకర్ కు చెందిన సర్వేనెంబర్ 114 భూమిలోనికి ప్రవేశించడమే కాకుండా ట్రాక్టర్ తో దున్నడం చేశాడు.

జార్జ్ దౌర్జన్యాన్ని ప్రశ్నించబోయిన దివంగత లక్ష్మి భర్త దేవదానం ను జార్జ్ అతని భార్య కొడుకు కలిసి చంపేస్తాము, అడ్డం వస్తే ట్రాక్టర్ తో తొక్కేస్తాము అని బెదిరించారు.జరిగిన సంఘటనను కరుణాకర్ వెంటనే పోలీసుల దృష్టికి తీసుకొని వచ్చాడు.తేదీ: 23 జూన్ 2026 రోజున కరుణాకర్ ఇచ్చిన ఫిర్యాదు పై సమగ్ర విచారణ చేసిన పోలీసులు నిన్న అనగా 26 జూన్ 2026 రోజున కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ జారీ చేశారు.

■ **మల్లిగారి జార్జ్, అతని భార్య సంతోష, కొడుకు మధుకర్ల పేర్ల పైన FIR No: 636/2026 ప్రకారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.**

**ఇట్టి కేసులో NS:329(3)..324(4)..351(2).. 115(2)..r/W 3(5) సెక్షన్ లతో మల్లిగారి జార్జ్ అతని కుటుంబం పైన నమోదు చేసిన కేసు తో పాటు అట్టి భూమిపై మల్లిగారి కరుణాకర్ కు ఇతర కుటుంబానికి సర్వహక్కులు ఉన్నాయని తేలిపోయింది.**

ఆలస్యంగా నైనా పోలీసులు ఇట్టి సివిల్ కేసు వివరాలు తెలుసుకొని బాధితులకు న్యాయం చేశారని కరుణాకర్ మిత్రులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఎల్లంపేట మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి నిషిత కరుణాకర్ కు అభినందనలు తెలుపుతూ పోలీసుల చర్యలను స్వాగతించారు.

■ **మేడ్చల్ పోలీసులపై తెలంగాణ హై కోర్టులో, మానవ హక్కుల కమిషన్ లో, ఎస్సీ ఎస్టీ కమిషన్ లో పెట్టిన కేసులను, వాటి విచారణలను కరుణాకర్ పర్యవేక్షిస్తున్నాడు.**

పోలీసులు తమ భూమిలో జార్జ్ కానీ, అతని కుటుంబ సభ్యులు కానీ అక్రమంగా ప్రవేశించకుండా, తమ హక్కులు భంగం కలిగించకుండా రక్షణ కల్పించాలని కరుణాకర్ మేడ్చల్ సిఐ సత్యనారాయణ గారిని కోరుతున్నాడు.

■ **చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని అమాయకుల జీవితాలతో ఆడుకునే మల్లిగారి జార్జ్ లాంటి భూ కబ్జాదారుల నుండి, దౌర్జన్యపరుల నుండి సామాన్యులకు సంబంధిత అధికారులు తగిన రక్షణ కల్పించి న్యాయం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.**

అధికారం ఉందని, తామేమి చేసినా చెల్లుతుందని స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు గానీ, నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు గానీ గ్రహించాలని కరుణాకర్ బహిరంగంగా విజ్ఞప్తి చేస్తున్నాడు.

అధికారం ఉన్నా లేకున్నా, ఏ పార్టీ నాయకులైనా న్యాయం పక్షాన ఉండాలని కరుణాకర్ విజ్ఞప్తి చేసాడు.

■ **మైసిరెడ్డిపల్లిలో దగాకోరుగా మారిన మల్లిగారి జార్జ్ మోసాల పట్ల పోలీసులు చేపట్టిన కఠిన వైఖరిని ప్రజల స్వాగతించారు.**

# ప్రపంచ శాంతి కోసం హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు

» రష్యా, ఫ్రాన్స్ సహా పలు దేశాల ప్రతినిధుల సమక్షంలో గ్లోబల్ పీస్ కాన్ఫరెన్స్

**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూన్ 26**
ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ న్యూస్ ఛానల్ మరియు బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ లో "గ్లోబల్ పీస్ కాన్ఫరెన్స్" ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రష్యా, ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాలకు చెందిన అంతర్జాతీయ దౌత్యవేత్తలు, శాంతి దూతలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై ప్రపంచ శాంతి, మానవతా విలువలు, అంతర్జాతీయ సహకారం, దౌత్య సంబంధాల బలోపేతంపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సదస్సులో గ్లోబల్ ప్రెసిడెంట్ -- ఇంటర్నేషనల్ డిప్లొమాటిక్ క్లబ్, బ్రిక్స్ కల్చర్ అండ్ మీడియా ఫోరం ఉపాధ్యక్షుడు, ఐక్యరాజ్యసమితి యూపీఎఫ్ పీస్ అంబాసిడర్ డా. సెర్గే ద్వోర్యానోవ్, వరల్డ్ అలయన్స్ "పీస్‌మేకర్" వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి యూరీ



సఫ్రోనోవ్, ప్రముఖ న్యూస్ ఛానల్ చైర్మన్ లక్ష్మీరావు, జాతీయ నాయకుడు, ప్రముఖ సామాజికవేత్త దుంద్ర కుమారస్వామి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా మాట్లాడుతూ దేశాల మధ్య పోటీ సహజమేనని, కానీ శత్రుత్వానికి తావు ఉండకూడదని అన్నారు. ప్రపంచ భవిష్యత్తుకు సహకారమే మార్గమని, శాంతి నెలకొంటేనే రైతుకు పంట, యువతకు ఉపాధి, పిల్లలకు విద్య, మహిళలకు భద్రత లభిస్తాయని పేర్కొన్నారు. ప్రముఖ ఛానల్ చైర్మన్ లక్ష్మీరావు మాట్లాడుతూ భారతదేశం వేల ఏళ్ల క్రితమే "వసుధైవ కుటుంబకం" అనే సందేశాన్ని ప్రపంచానికి అందించిందని, ప్రపంచమంతా ఒకే కుటుంబమనే భావనతో మానవత్వం, స్నేహం, శాంతి కోసం అన్ని దేశాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జాతీయ నాయకుడు దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ.. దేశాల సరిహద్దులు వేరైనా, మానవత్వానికి సరిహద్దులు ఉండవని, ప్రపంచాన్ని ఏకం చేసే శక్తి శాంతి మాత్రమేనని అన్నారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంపద మనిషి ప్రాణమని, యుద్ధం విధ్వంసాన్ని సృష్టిస్తే శాంతి అభివృద్ధికి మార్గం చూపుతుందని పేర్కొన్నారు. తుపాకులు సమస్యలను పరిష్కరించలేవని, సంభాషణలు, దౌత్య సంబంధాల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. ఆయుధాలపై చేసే వ్యయంకంటే విద్య, వైద్యం, మానవాభివృద్ధిపై పెట్టుబడులు ప్రపంచానికి మరింత మేలు చేస్తాయని, యుద్ధంలో గెలిచిన దేశాలు చరిత్రలో నిలిచినా, శాంతిని కాపాడిన నాయకులు మానవ హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన దౌత్య ప్రతినిధులు, సామాజికవేత్తలు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్‌లో రెండు బైక్‌లు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

■ కంటత్మకూర్‌కు చెందిన కొత్తూరు ప్రశాంత్ పరిస్థితి విషమం

**కరపత్రం ప్రతినిది నడికూడ, జూన్ 26**
రామకృష్ణాపూర్ గ్రామ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు



ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికుల వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో కంటత్మకూర్ గ్రామానికి చెందిన కొత్తూరు ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతనికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు!

### ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు రాజీనామా !

సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు. రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి.రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు.ఎఫ్ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు.

## ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా రేగుల సంతోష్ బాబు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా వేములవాడ పట్టణానికి చెందిన రేగుల సంతోష్ బాబును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రేగుల సంతోష్ బాబు తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాల్సిన సంక్షేమ పథకాల సాధనకు రాజీలేని పోరాటం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన హుజురాబాద్ ఆర్డీవో జలకుమారి

**జమ్మికుంట, జూన్ 26 కరపత్రం ప్రతినిధి**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రేవిషన్ – ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమాన్ని హుజురాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) జలకుమారి శుక్రవారం జమ్మికుంట పట్టణంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నంబర్--177ను సందర్శించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అమలును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో నిర్వహిస్తున్న కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇతర సాంకేతిక అంశాలపై ఆర్డీవో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో జరుగుతున్న కార్యక్రమాలపై బీఎల్‌వోలతో మాట్లాడిన ఆర్డీవో జలకుమారి, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్న ప్రక్రియను సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని యువత, ఇటీవల 18 సంవత్సరాలు నిండిన



అర్హులైన యువ ఓటర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగానే తమ వివరాలను సరిచూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయడం జరిగింది. ఫారాలను పూర్తిగా, సరైన వివరాలతో నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వివరాలను ధృవీకరించుకోవాలని ఆర్డీవో కోరారు. ఈ సందర్భంగా ఓటర్లతో నేరుగా మాట్లాడిన ఆమె, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, వయస్సు తదితర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే బీఎల్‌వోలకు తెలియజేసి సరిదిద్దించుకోవాలని చెప్పారు. ఈ తనిఖీలో ఆర్డీవో



వెంట గిర్దావర్ గద్దం శంకర్, జీపీవో శ్రవణ్, బీఎల్‌వో అఖిలాండం పాల్గొన్నారు. వారు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లకు ప్రత్యేక సవరణ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి, అవసరమైన ఫారాలను పంపిణీ చేశారు. అలాగే ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జమ్మికుంట పట్టణంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని ప్రజాస్వామ్య బలోపేతానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని వారు పిలుపునిచ్చారు.

## వర్షాకాలం నేపథ్యంలో శ్రీ భీమేశ్వర ఆలయంలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధమైన దేవాలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శానిటేషన్ అధికారులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈవో రమాదేవి ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణం, పరిసరాలను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు, క్రిమికీటకాలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టారు. పారిశుధ్య కార్యక్రమాన్ని ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ పరిశీలించారు. వర్షాకాలం మొత్తం ఇలాంటి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లు కొనసాగుతాయని శానిటేషన్ అధికారులు తెలిపారు.

## కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞత సభ

**చలో కొడంగల్ కారు ర్యాలీని విజయవంతం చేయాలి : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం**

**జమ్మికుంట, జూన్ 26 కరపత్రం ప్రతినిధి**

తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా ఈ నెల 28న కొడంగల్‌లో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీ జనరల్, జిల్లా అధ్యక్షులు ఎక్కటి సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జమ్మికుంట లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించనున్న "చలో కొడంగల్" కారు ర్యాలీలో రాష్ట్రంలోని 33 జిల్లాల ఉద్యమకారులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 28వ తేదీ ఆదివారం చేవెళ్ల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొడంగల్ వరకు నిర్వహించే కారు ర్యాలీ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యతకు నిదర్శనంగా నిలవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రత్యేక హామీలు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఆ హామీల అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు ప్రారంభించడం ఉద్యమకారుల్లో ఆశలను పెంచిందన్నారు. ఇటీవల తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు, డిమాండ్లపై అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కేకే కమిటీని ఏర్పాటు చేయడం స్వాగతించదగిన నిర్ణయమని ఎక్కటి సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు కొడంగల్‌లో ప్రత్యేక సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే కమిటీ ఏర్పాటు వద్దనే ప్రక్రియ ఆగిపోకుండా, కాలయాపన లేకుండా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారుల సేవలను గుర్తించి వారికి తగిన గౌరవం, సంక్షేమ పథకాలు, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా ఉద్యమకారులు పెద్ద



ఎత్తున స్వచ్ఛందంగా కారు ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ అన్ని జిల్లాల నుంచి ఉద్యమకారులు కొడంగల్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మూడేళ్ల కుమారస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె రమేష్ రెడ్డి, రేణిగుంట్ల రజినీకుమార్, జమ్మికుంట టౌన్ అధ్యక్షులు మద్దూరి శంకరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్ర భూమిరెడ్డి, ఉపాధ్యక్షులు రాంరాజబాబు, ఎజ్జే తిరుపతి, మోతె స్వామి, ఇమ్మడి రాజు, జిల్లా కార్యదర్శి కనవేని సతీష్ కుమార్, రచ్చ గణేష్, అక్కనపెల్లి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

ప్రభుత్వ సెలవు సందర్భంగా శుక్రవారం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని రుద్రాభిషేకం, అన్నపూజ, నిత్య కల్యాణం, చండీ హోమం, కుంకుమ పూజ తదితర విశేష పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈవో రమాదేవి ఆదేశాల మేరకు ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రత్యేక ఏర్పాట్లు చేసి, దర్శనం సజావుగా నిర్వహించారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి..

**– పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 26:**

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ సీఐలు ఇంద్రసేనారెడ్డి, అఫ్జలొద్దీన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గోదావరిఖని మున్సిపాలిటీ జంక్షన్ వద్ద గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించే ఉద్దేశంతో మానవహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేష్ హాజరై విద్యార్థులతో కలిసి మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేష్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలైన వారిని నేరస్తులుగా కాకుండా బాధితులుగా చూడాలని అన్నారు. మత్తువ్యసనానికి గురైన వారిలో ఆరోగ్య పరిస్థితి, మానసిక స్థితి, ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా డీ–అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు వ్యసనానికి గురైన వారిని గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే, వారిని సంబంధిత ఆసుపత్రులు, డీ–అడిక్షన్ సెంటర్లకు తరలించి వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాసం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యసనాన్ని శిక్షల ద్వారా కాకుండా చికిత్స ద్వారా నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత కీలకమని పేర్కొంటూ, డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సమాజాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం నిర్వహణ సందర్భంగా కొంతమంది వాహనదారులకు స్వల్ప అసౌకర్యం కలిగినప్పటికీ సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గంజాయి నియంత్రణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, సమాజ భద్రత కోసం ప్రజలు పోలీసులకు నిరంతరం సహకరించి, సమాచారం అందించాలని కోరారు. డీసీపీ బి.రామ్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 22 నుంచి 26 వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా



గోదావరిఖని సబ్‌డివిజన్‌లో మానవహారం నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని గంజాయి, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గత ఆరు నెలలుగా పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్, గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ పరిసరాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్–100 లేదా 1908కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజాన్ని, ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని డీసీపీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మనోహర్, అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థినీ–విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## జూలై 1న కలెక్టరేట్ ముట్టడికి వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బోయిన్ పెల్లి మండలం దేశాయ్‌పల్లి దళితవాడను నాయకులు సందర్శించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. దళితవాడలో డ్రైనేజీలను నిర్మించాలని, దళితులు, గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.6 లక్షల ఆర్థిక సహాయం హామీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలో అమలు చేయడం, 200 రోజుల పని, రోజుకు రూ.600 వేతనం, పట్టణ ప్రాంతాలకు కూడా ఉపాధి కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 1న ఉదయం 11 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కుడుకల గిరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలి

**కరపత్రం ప్రతినిధి భీమదేవరపల్లి;**

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత అభివృద్ధి చేసేలా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ భీమదేవరపల్లి మండల శాఖ నూతన అధ్యక్షులు పోచంపల్లి రాజిరెడ్డి ఉన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ముల్కనూర్ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం గ్రామ గ్రామాన సమావేశాలు ఏర్పాటు చేస్తూ ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమం, రవాణాశాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ చొరవతో అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యకర్తలకు నాయకులు అందుబాటులో ఉండేందుకు ముల్కనూర్ లో పార్టీ కార్యాలయం త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక ఓటర్ సవరణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కార్యకర్తలు నూతన అధ్యక్షులు రాజిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఆదరి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు చిట్టంపల్లి ఐలయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జక్కుల అనిల్ యాదవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వరూప, సర్పంచులు వెంకన్న, శ్రవణ్, గజ్జల సృజన రమేష్, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రా ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు స్రవంతి, మొండయ్య నాయకులు ప్రకాష్, గుడి కందుల రాజు, నరేందర్ గౌడ్, గట్టు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

